చైతన్యపురిలో మెగా రక్తదాన శిబిరం

రక్తదానంలో పాల్గొన్న యువత

ఎల్బీనగర్, ఫిబ్రవరి 16: చైతన్యపురిలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన సీఆర్పీఎఫ్ వీర జవాన్ల త్యాగాలను స్మరిస్తూ మెగా రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. చైతన్యపురి రాధా ఇనిస్టిట్యూట్ ఫర్ మెంటల్ రిటైర్డ్ భవనంలో జరిగిన ఈ శిబిరంలో 25 మందికి పైగా యువతీ యువకులు రక్తదానం చేసి అమరవీరులకు పుష్పాలతో నివాళులర్పించారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా సంస్థ సభ్యులు చైతన్య, ప్రేమ్ కుమార్, రాజశేఖర్, ప్రణీత్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కుమ్మరుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంకోటి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16: కుమ్మరుల సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మన్సూరాబాద్‌కు చెందిన ఏలుకొండ రాంకోటి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకారపు మోహన్ నియామకపత్రాన్ని ఆదివారం రాంకోటికి అందజేశారు. ఈ సందర్భంగా రాంకోటి మాట్లాడుతూ.. 2019 నుంచి సంఘం రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసి అభివృద్ధికి కృషి చేశానన్నారు. తన నియామకానికి సహకరించిన వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్, అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యాదగిరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

- వృథాగా మిగిలిపోయిన కందుకూరు షెడ్డు
- నేటికీ రోడ్డుపైనే అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కందుకూరులో నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్ షెడ్డు

కందుకూరు, ఫిబ్రవరి 16 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కందుకూరు మండల కేంద్రంలో రూ. 29 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉంటున్నది. దీంతో ప్రజాధనం వృథా అవుతున్నదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో మండలంలోని రైతులు, వ్యాపారులు కూరగాయలు, పండ్లను రోడ్లపైన విక్రయించేవారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవాల్సి వస్తున్నదని, షెడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం కన్పించలేదు. అనంతరం విషయాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి రూ. 29 లక్షలను మంజూరు చేశారు. దాంతో మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ పక్కనే కూరగాయల షెడ్డు నిర్మించారు. అయితే మార్కెట్ షెడ్డును మాజీ మంత్రి ప్రారంభించి ఇప్పటికీ 9 నెలలు కావస్తున్నా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఫలితంగా మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉండి కుక్కలు, పందులు, కోతులకు నిలయంగా మారింది. మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మార్కెట్లో కూరగాయలు విక్రయించడానికి సరైన వసతులు కల్పించి తక్షణమే మార్కెట్ షెడ్డులో విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి

కందుకూరులో కూరగాయల మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి. విక్రయదారులు నేటికీ రోడ్డుపైనే కూరగాయలను అమ్ముతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులు, వ్యాపారులు కూరగాయలను రోడ్ల పైన విక్రయించకుండా మార్కెట్ షెడ్డులో విక్రయించేలా చర్యలు తీసుకొవాలి.

– కాకి దశరథ ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

రోడ్డుపై విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి

వ్యాపారులు, రైతులు కూరగాయలు, పండ్లను రోడ్డుపై విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై విక్రయాలు నిలిపివేయాలి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కృషితో ఇక్కడ మార్కెట్ షెడ్డు ఏర్పాటు చేశారు. అధికారులు షెడ్డులో వసతులు కల్పించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

– సామ ప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

కేసీఆర్ పాలనలోనే ఆలయాల అభివృద్ధి



హయత్‌నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే తెలంగాణలో ఆలయాల అభివృద్ధి జరిగిందని మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ఆలయాల ఏర్పాటుతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందన్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ టంగుటూరి నాగరాజు, నాయకులు ఆనంద్ యాదవ్, నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్ : హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలో రేణుకా ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉగాది ఎల్లప్ప, గంగని శ్రీను, పారంద మహేశ్, సంఘి అశోక్, భక్తులు పాల్గొన్నారు.

కుల గణనలో పాల్గొనని వారికి మరో అవకాశం

ఈనెల 28 వరకు సర్వే

- ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ

మలక్ పేట, ఫిబ్రవరి 16: కుల గణనలో పేరు నమోదు చేసుకోని వారి కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేక కాల్ సెంటర్(040-2111 1111)ను ఏర్పాటు చేసిందని సౌత్ జోన్ సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 28 వరకు మరోసారి సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కులగణనలో నమోదు కాని వారి కుటుంబసభ్యులు మాత్రమే పైన తెలిపిన నంబర్‌కు కాల్ చేసి వివరాలు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ తదితర వివరాలు తెలియజేయాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కాల్‌సెంటర్ పని చేస్తుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజలతో పాటు వివిధ జిల్లాల కాల్స్‌ను కూడా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. కాల్ చేసే వ్యక్తి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో అయితే గ్రామం వీధి నెంబర్, పిన్‌కోడ్, అడ్రస్ తదితర వివరాలు వెల్లడించాలని, పట్టణాల్లో అయితే సర్కిల్, వార్డు నంబరు తెలియజేస్తే ఎన్యూమరేటర్లు వారి ఇంటికి వచ్చి సర్వే వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డీసీ జయంత్ సూచించారు.

సీవీ రామన్ యంగ్.. అవార్డులు ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 16 : సామాజిక సేవా సంస్థ సుచరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32వ సీవీరామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షలు జాతీయ, రాష్ట్రస్థాయిలో వివిధ పాఠశాలలో నిర్వహించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ ఆదివారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్ ప్రాంగణంలో జరిగింది. వెయ్యి పాఠశాలలనుంచి పదివేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో గోల్డ్ మెడల్స్, నేషనల్ ర్యాంక్,రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి మెడల్స్, అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. సుచరిండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వై.కిరణ్, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ నటులు రావు రమేశ్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

ఎస్‌బీహెచ్ కాలనీలో సమస్యలను పరిష్కరించండి

- అధికారులకు మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ఆదేశం

మలక్‌పేట ఎమ్మెల్యే బలాలకు సమస్యలను వివరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

సైదాబాద్,ఫిబ్రవరి 16: సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీలో ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఎస్‌బీహెచ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, అవసరమైన చోట కొత్త లైన్లను నిర్మించాలని, లోప్రెషర్ వాటర్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఫుట్‌పాత్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాలనీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎస్‌బీహెచ్ జీఏ-1 కాలనీ అసోసియేషన్ సభ్యులు రమేశ్, దాదా హయత్‌ఖాన్, రామకృష్ణ, కేవీ మురళీధర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగునాళ్ల జిందగీ వీడియో సాంగ్ విడుదల

రవీంద్రభారతి, ఫిబ్రవరి16 : వర్ధమాన సినీ రచయిత శ్రీ కీర్తి వేణుగోపాల్ రచించిన నాలుగునాళ్ల జిందగీ వీడియో సాంగ్ గీతావిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతిలోని భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ కార్యాలయంలో ఆవిష్కరించారు. మానవ జీవితం యొక్క గొప్పతనాన్ని ప్రేమ, ఆప్యాయతల అవసరాన్ని రచయిత శ్రీ వేణుగోపాల్ ఈ పాటలో ఆవిష్కరించారని అభినందించారు.

సమస్యలను పరిష్కరించాలని ఎంపీకి వినతి

మల్కాజిగిర ఎంపీ ఈటల రాజేందర్‌కు సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

మన్సురాబాద్, ఫిబ్రవరి 16: నాగోల్ డివిజన్ పరిధి రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని శ్మశానవాటికతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శ్మశానవాటికను వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. కాలనీలో ఎంపీ నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులతో మాట్లాడి శ్మశానవాటిక సమస్యను పరిష్కరిస్తానని, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మణి పాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి రామ్‌రెడ్డి, మాధవరెడ్డి, కాలనీవాసులు వెంకటరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సేవలు అభినందనీయం

వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్

హయత్‌నగర్, ఫిబ్రవరి 16 : డివిజన్‌లోని కమలానగర్‌లో సీనియర్ సిటిజన్ల సేవలు అభినందనీయమని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్‌లోని కమలానగర్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం సభ్యులు, సుప్రజ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. వయసులో పెద్దవారైనప్పటికీ చురుకుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. శిబిరంలో వైద్య సిబ్బంది ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు పాటి యాదిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, సారంగం, సుబ్బారావు, పూలమ్మ, గంగని శ్రీను, గోవర్ధన్, విఠల్, అచ్చయ్య, సత్యమూర్తి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16: నాగోల్ డివిజన్ బండ్లగూడ, హనుమాన్ నగర్ కాలనీ వినాయక మండపంలో ఆదివారం జనహిత సేవా ట్రస్ట్, శ్రీ భాస్కర ఐ అండ్ డెంటల్ క్లినిక్, అపోలో షుగర్ క్లినిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వందమంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దంత వైద్యులు వివేక్ భార్గవ్ దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. భారత్ వికాస్ పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు. అదేవిధంగా కంటి వైద్యులు డాక్టర్ ఐవీ రమ్య పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వి. అఖిల్, హనుమాన్ నగర్ కాలనీ అధ్యక్షుడు నరేందర్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ ప్రసాద్, నారాయణ, గణేశ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

అగర్ మియగూడలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఉప సర్పంచ్ రేవంత్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 16 : యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని మండలంలోని అగర్ మియగూడ మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం అగర్ మియగూడలో యువకులు ఏర్పాటుచేసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్, సీజన్ 8ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో యువకులు భాగస్వాములు కావాలని కోరారు.

కార్యక్రమంలో గోసుల కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, షేక్ మున్నా, రవీందర్ ముదిరాజ్, ప్రశాంత్, అంజిరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు కిట్లు అందజేత

అన్నోజిగూడలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం, ఫిబ్రవరి 16: క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింతగా రాణిస్తారని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ వాలీబాల్ క్రీడాకారులకు ఆదివారం సొంత నిధులతో ఇక్కడి తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే ఉత్సాహంగా క్రీడలు ఆడి తమలోని ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన జ్ఞాన కేంద్రం, యోగా, ఓపెన్ జిమ్, నడక ప్రాంతాన్ని, బాలీబాల్, క్రికెట్ క్రీడా ప్రాంగణాలను యువత ఉపయోగించుకోవాలని సూచించారు. నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించి ఆదర్శంగా నిలవాలి

ఘట్‌కేసర్‌లో ఇంటి పన్ను చెల్లిస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావని

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించడంతోపాటు ఆదర్శంగా నిలవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలోని తమ నివాసం వద్ద మున్సిపల్ సిబ్బందికి ఇంటి పన్ను చెల్లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఇంటి పన్నులు చెల్లించడం ద్వారా అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరుగుతుందని చెప్పారు. ఇంటి పన్ను కట్టినప్పుడే ప్రశ్నించే తత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు వివాహాలు

నూతన వధూవరులకు వివాహాలు జరిపిస్తున్న నాగమల్లి అనిల్‌కుమార్, అరుణ దంపతులు

సైదాబాద్/ఆర్కేపురం, ఫిబ్రవరి 16: రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ ఎస్‌బీహెచ్ జీఏ-2 కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఇద్దరు అనాథలకు వివాహాలు జరిపించారు. ఫౌండేషన్ నిర్వాహకులు నాగమల్ల అనిల్‌కుమార్ గుప్తా, అరుణ దంపతులు నూతన వధూవరులు శృతి-శివకుమార్, నవనీత-ప్రవీణ్‌కు శాస్త్రోక్తంగా హైందవ ధర్మం ప్రకారం వివాహ వేడుకలు జరిపించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరింత మంది అనాథలకు పెళ్లిళ్లు జరిపిస్తామన్నారు. ఈ వేడుకల్లో బద్దం ప్రేమ మహేశ్వర్‌రెడ్డి, జగనీ శ్రీనివాస్, శరత్‌కుమార్ కృష్ణకుమారి, రామ్ సేవా ట్రస్టు అధ్యక్షుడు కొంచెం నరసింహారావు, కొండా సురేశ్‌కుమార్, నీలా వెంకటేశ్, అనిల్ కుమార్ అరుణ దంపతులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందనలు

కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, కోచ్‌ను అభినందిస్తున్న వజీర్ ప్రకాశ్‌గౌడ్

ఎల్బీ నగర్, ఫిబ్రవరి 16 : విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన రెండవ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. హైదరాబాద్ సీనియర్ బ్లాక్‌బెల్ట్ హోల్డర్, కోచ్ విజయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పవన్ తేజ, హృతిక్, కార్తికేయ, ఆశ్రుత్, శ్రీహిత్, కెవిన్ బంగారు, వెండి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా అదివారం కొత్తపేట మహిళా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్ పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కోచ్ విజయ్‌ను సన్మానించారు. అదేవిధంగా కరాటేలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు వివిధ రకాల బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వజీర్ ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కరాటేతోపాటు చదువులోనూ రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

కార్యక్రమంలో సీనియర్ నాయకులు చావా సత్యనాగ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

ఉప్పల్, ఫిబ్రవరి 16: నాచారంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకున్నది. నాచారంలోని డెక్కన్ స్పింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో పలు తరగతుల విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించే విధంగా ప్రదర్శనలో నమూనాలను నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్‌రావు, కోర్ ఆపరేషన్ హెడ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమా మీనన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గణితం, ఇంగ్లిష్, సోషల్ సైన్స్, ఐసీటీ, ఆర్ట్స్, క్రాఫ్ట్, తదితర అంశాల ప్రాజెక్టును ప్రదర్శించారు.

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

క్రీడలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని జాతీయ స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాదారంలో నిర్వహిస్తున్న మాదారం ప్రీమియర్ లీగ్ సీజన్-6 క్రికెట్ క్రీడలను ఆదివారం ఆయన ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తి కలిగిన ప్రతిఒక్కరూ అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. క్రీడల వలన మనిషికి శారీరక, మానసిక ఆరోగ్యం దృఢపడుతుందని చెప్పారు. క్రీడల వల్ల మానవ సంబంధాలు బలపడుతాయని, ప్రతిఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో క్రికెట్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, మాజీ కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 16. తెలంగాణ రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నాంపల్లి లోని పోట్టి రాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొనగాల మహేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరై క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాల అమలులో రెవెన్యూ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తారని ఈ సందర్భంగా మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

ఉప్పల్, ఫిబ్రవరి 16: ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రమణి సిద్ధి ఆధ్వర్యంలో నెలనెల కళారాధన కార్యక్రమంలో భాగంగా త్యాగరాజ పంచరత్న కీర్తనలు, నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. గురువులు నూతి ప్రసూన, రమణి సిద్ధి, బాలాజీకుమార్, రాజేశ్వరి, విశాఖ ప్రకాశ్, మాధవిశర్మ శిష్య బృందం త్యాగరాజ కృతులు, దుడుకు గల నన్నే దొర, ఎందరో మహానుభావులు, గణేశా పంచరత్న, జగదానంద కారక, మొదలైన అంశాలకు కళాకారులూ నృత్య ప్రదర్శన చేపట్టారు.

ప్రముఖ నాట్య గురువులు పీబీ కృష్ణభారతి ముఖ్యఅతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT NALGONDA
O.S.No. 197 OF 2022

BETWEEN:
Bodanam Chandrakala
W/o Jalendar Reddy
D/o. Somidi MallaReddy @ Mallaiah
...Plaintiff
AND
Siriguri. Vimalamma W/o Ramreddy
D/o. Somidi Malla Reddy @ Mallaiah
& 10 others ...Defendants